# భక్తిశ్రద్ధలతో గణనాథుల నిమజ్జనం



పెద్దకొత్తపల్లి : కోలాటం వేస్తున్న మహిళలు



కల్వకుర్తి రూరల్ : లడ్డూను దక్కించుకున్న వారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 12 : తిమ్మాజిపేట మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను అందంగా ఆలంకరించిన వాహనాల్లో ఉంచి యువకుల నృత్యాలు, భజనలు, కోలాటాలు, మహిళల బొడ్డెమ్మల మధ్య ఊరేగింపు నిర్వహించి వినాయకులను ఆయా గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశా రు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



తిమ్మాజిపేట : వినాయకుడిని ఊరేగిస్తున్న యువకులు

### పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 12 : మండలంలోని వెన్నచర్ల, నక్కలపల్లి, జొన్నలబొగుడ, పెద్దకొత్తపల్లి గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదు రోజులపాటు భక్తులతో విశేష పూజలందుకున్న వినాయకులను ఆయా గ్రామాల్లోని చెరువుల్లో గురువారం నిమజ్జనం చేశారు. వినాయక మండపాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. పలు మండపాల వద్ద లడ్డూ వేలం నిర్వహించా రు. ఎలాంటి ఘటనలు జరగకూడా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

### కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 12 : కల్వకుర్తి పట్టణంలోని వీబీఎస్ పాఠశాలలో గురువారం వినాయక నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుడి లడ్డూ, పూజా సామగ్రికి వేలం నిర్వహించారు. లడ్డూను రూ.12,600లకు కల్పన వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ యాదగిరి, కరెస్పాండెంట్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## ఐశ్వర్య గణపతిని దర్శించుకున్న దేశపతి శ్రీనివాస్



ఐశ్వర్య గణపతి వద్ద దేశపతి, దేవీప్రసాద్

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 12 : తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలోని ఏకశిలా విగ్రహం ఐశ్వర్య గణపతిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీ ప్రసాద్‌రావులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విగ్రహ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. విగ్రహం అద్భుతంగా ఉందని, దుందుభీ పరివాహాకంలో గణపతి విగ్రహం ఉన్నందున ఇక్కడ ఆలయం నిర్మిస్తే దేశంలోనే అద్భుతమైన ఆలయాల్లో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు. వారి వెంట మాజీ సర్పంచ్ ఉశన్న, ప్రభాకరచారి, వెంకటయ్య, కృష్ణయ్య ఉన్నారు.

## గణనాథుడి మండపంలో అగ్నిప్రమాదం

- తప్పిన ప్రమాదం

చారకొండ, సెప్టెంబర్ 12 : మండలంలోని జూపల్లిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అదే గ్రామానికి చెందిన అక్కి శేఖర్ తన ఇంటి ఎదుట రేకుల కప్పు కింద మండపం ఏర్పాటు చేసి గణనాథుడిని ప్రతిష్ఠించారు. ఐదు రోజులపాటు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా బుధవారం రాత్రి విద్యుదాఘాతంలో మండలంలో మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో మండపంలో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చుట్టు పక్కల వారు గమనించి కల్వకుర్తి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే మండలంలో సామగ్రిలు పూర్తిగా దగ్ధంమయ్యాయి.



మండపంలో మంటలు అర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

## రక్తదాన శిబిరం విజయవంతం

- ఘనంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదిన వేడుకలు



రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 12 : అచ్చంపేట పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రక్తదానం చేయడంతో ఇతర ప్రాణాలు కాపాడిన వారమవుతామని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణకు కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, నాయకు లు రామకృష్ణా రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్ గౌరిశంకర్, మాజీ ఎంపీపీ రామనాథం, అశోక్, ప్రసాద్ పాల్గొన్నారు.

### లింగాలలో..



ఎమ్మెల్యేకు శుభాకాంక్షాలు తెలుపుతున్న రాజు

లింగాల, సెప్టెంబర్ 12 : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిది అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ నా యకుడు ఉల్లంగొండ్ల రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అంతకముందు కాంగ్రెస్ నాయకుడు రాజు అచ్చంపేట క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన తాసీల్దార్లు

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 12 : తిమ్మాజిపేట తాసీల్దార్‌గా రామకృష్ణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. బుధవారం జిల్లాలో జరిగిన బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేసిన మోహన్ పెద్దకొత్తపల్లికి బదిలీకాగా, ఆయన స్థానంలో గద్వాల జోగుళాంబ జిల్లా రాజోళి మండలం నుంచి డిప్యూటీ తాసీల్దార్‌గా పనిచేసిన రామకృష్ణయ్య ఇక్కడికి పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మోహన్‌తో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు.

### వెల్దండ తాసీల్దార్‌గా..



వెల్దండ : తాసీల్దార్ కార్తీక్‌కుమార్‌ను సన్మానిస్తున్న వెంకటయ్యగౌడ్

వెల్దండ, సెప్టెంబర్ 12 : వెల్దండ తాసీల్దార్‌గా కార్తీక్‌కుమార్ గురువారం తాసీల్దార్ రవికుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెల్దండ సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్యగౌడ్ తాసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు స్వాగతం పలికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఇక్కడ విధులు నిర్వర్తించిన తాసీల్దార్ రవికుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

## రికార్డుల పరిశీలన

ఊర్కొండ, సెప్టెంబర్ 12 : మండలంలోని రేవల్లి, తిమ్మన్నపల్లి గ్రామాల్లో ఎంపీడీవో కృష్ణయ్య గురువారం పర్యాటించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకొన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్ నాయక్, ఏపీవో నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు సరిత, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 12 : సమస్యలను దృష్టికి తీసుకొస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వ్యవసాయ రంగాలకు మొదటి ప్రాధాన్యతను ఇస్తుందని, అందులో భాగంగానే నియోజకవర్గంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కానీ సమస్యలుంటే వాటిని తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. జిల్లా కేంద్రంలోని వెలమ ఫంక్షన్‌హాల్‌లో ఓ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా సదస్సుకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. 40 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిష్కరిస్తారని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారని పేర్కొన్నారు. పండితుల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. తెలకపల్లిలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యలపై తనకు ఫిర్యాదు చేయడంతో వెంటనే సందర్శించి కమిషనర్, కలెక్టర్‌తో చర్చించమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, రామ్మోహన్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

## 17న ప్రజాపాలన దినోత్సవం

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 12 : ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం కోరారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఈనెల 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్లపై జిల్లా అధికారులకు తమ శాఖలకు సంబంధించిన పనులపై దిశానిర్దేశం చేశారు. ప్రజాపాలనకు ముఖ్యఅతిథిగా ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండావిష్కరణ చేయనున్నట్లు, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అధికారులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు

## ఉమామహేశ్వరాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

అచ్చంపేటరూరల్, సెప్టెంబర్ 12 : ఉమా మహేశ్వరాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సతీమణి అనురాధ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ముందుగా పాపనాశానిలో పుణ్యాస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమార్చన స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఉమా మహేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజలందరు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు వీరయ్యాశాస్త్రి పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధికి కృషి : కశిరెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 12 : కల్వకుర్తి పట్టణాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కాలనీల్లో సమస్యలు తలెత్తితే వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షాహెద్, మున్సిపల్ కమీషనర్, కౌన్సిలర్లు, అధికారులు ఉన్నారు.

## నేషనల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాజేశ్‌బాబు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 12: సుప్రీం కోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు ఈనెల 28వ తేదీన 7వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్ భవనంలో న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సబితతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిధిలోని కోర్టుల్లో అనేక రకమైన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కోర్టులో వేయని వివాద కేసులు ఉంటే అవి కూడా ముందస్తు పిటిషన్లు ఫిర్యాదుగా స్వీకరించి సమన్యాయం అందించడానికి లోక్ అదాలత్ మంచి పాత్రను పోషిస్తుందన్నారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి కోర్టుల్లో ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు జాతీయ లోక్ అదాలత్ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటలకు న్యాయమూర్తులు అందుబాటులో ఉంటారని, కక్షిదారులు కలిసేలా ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈసారి కొత్తగా సుప్రీంకోర్టు తీరుకువచ్చిన నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టులో ఉన్న తగాదాలను సైతం ఇరుపక్షాల వారు తమ న్యాయవాదులతో జిల్లా న్యాయస్థానంలో నిర్వహించే లోక్ అదాలత్‌లో సంప్రదిస్తే ఆ కేసు పుర్వాపరాలను పరిశీలించి జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఆరుసార్లు లోక్ అదాలత్ ద్వారా 56,451 కేసులు పరిష్కారం చేశామన్నారు. ఈనెల 28న లోక్‌అదాలత్ ద్వారా 18వేలకుపైగా కేసులను పరిష్కరించేలా టార్గెట్ పెట్టుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

## జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 12: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత భారీ వర్షాలు, వరదలు తెలంగాణ ప్రాంతాన్ని అతలాకుతం చేశాయని రాష్ట్రంలో వేలకోట్ల నష్టం వాటిల్లిందన్నారు. పట్టణాలు పల్లెల్లో పాతబడ్డ చాలా ఇండ్లు నేలమట్టమయ్యాయని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో సంభవించిన నష్టాన్ని పూడ్చే కార్యక్రమం చేపట్టాలని, అందులో భాగంగా తక్షణ సహాయంగా తెలంగాణ రాష్ట్రానికి రూ.10కోట్ల సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వెంకటయ్య, ఫయాజ్, కేశవులుగౌడ్, నర్సింహ, ఏసయ్య, భరత్, శ్రీనివాస్, కృష్ణాజీ, రవీందర్, శివుడు, ఖాజా, కిరణ్‌కుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

## కొల్లాపూర్ మున్సిపాలిటీలో భారీ అవినీతి జరిగింది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్ రావు

కొల్లాపూర్, సెప్టెంబర్ 12: కొల్లాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక భారీ అవినీతి జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు ఆరోపించారు. కొల్లాపూర్ అభివృద్ధి కోసం వచ్చిన నిధులన్ని దారి మళ్లినట్లు తెలుస్తోందన్నారు. దాదాపు రూ.3కోట్ల దాక నిధులను ఎలా ఖర్చు చేశారో తెలియని పరిస్థితి ఉందన్నారు. గురువారం కొల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను బీజేపీ నాయకులు రమేశ్, ధనుజయ్‌గౌడ్, కృష్ణ, కాశీపురం మహేశ్, మద్దిలేటి, మల్లికార్జునలతో కలిసి మున్సిపల్‌కు వచ్చిన నిధులను మున్సిపల్ అభివృద్ధి కోసం ఎలా ఖర్చు చేశారో తెపాలని ఆర్‌టీఐ ద్వారా అడిగారు. వారం లోపు పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. కొల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పడక వేసిందన్నారు. పారిశుధ్యం పూర్తిగా లోపించందని కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదన్నారు. కానీ మున్సిపల్ నిధులు ఎలా మాయం అవుతున్నాయని ప్రశ్నించారు. మున్సిపల్ సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు ఉన్నారు.

## వినాయక మండప నిర్మాణానికి భూమి పూజ

వెల్దండ, సెప్టెంబర్ 12 : మండలంలోని దుబ్బతండాలో వినాయక మండప నిర్మాణానికి మాజీ సర్పంచ్ పంతునాయక్ గురువారం భూమిపూజ చేశారు. దుబ్బతండా గ్రామ పెద్దల కోరిక మేరకు వినాయక మండప నిర్మాణానికి సహకరిస్తానని యువకులకు ఇచ్చిన హామీ మేరకు భూమి పూజ చేసినట్లు పంతునాయక్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సేవ్యానాయక్, గోపాల్, రేక్యానాయక్, మున్నా, వెంకట్‌రాం, రమేశ్, శ్రీను తదితరులు ఉన్నారు.

## చేనేత కార్మికుల రుణమాఫీపై హర్షం

అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 12 : చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉండి రూ.30కోట్లు రుణమాఫీ చేయడం హర్షణీయమని గురువారం అచ్చంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిశోర్ అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ ప్రకటించడంతో పాటు వివిధ పథకాల కింద బకాయి ఉన్న రూ.290కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ పాలక వర్గాన్ని ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి రాష్ట్రంలో ఉన్న రూ.30లక్షల మంది పద్మశాలీలకు అండగా నిలవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేయాలి



మాట్లాడుతున్న ఏడీఆర్ మల్లారెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 12: రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటను తీసుకునేందుకు అనువైన అధికసాంద్రత పద్ధతులు పాటించాలని ఏడీఆర్ మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాలెం గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో అధిక సాంద్రత పత్తి విస్తీర్ణం సాగుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ పద్ధతిని అనుసరించడంతో కలిగే లాభాల గురించి వివరించారు. పత్తిసాగులో అధునాతన సాంకేతికమైనటువంటి న్యూమాటిక్ ప్లాంటర్ వాడడం వల్ల కలిగే లాభాల గురించి తెలిపారు. అదేవిధంగా పంటదశను బట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఏడీఏ పూర్ణచంద్రారెడ్డి, కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు సైదా, రామకృష్ణ, రాజశేఖర్, ఆదిశంకర్, జ్యోత్స్న, రైతులు ఉన్నారు.

## శరన్నవ రాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

కల్వకుర్తిరూరల్, సెప్టెంబర్ 12 : కల్వకుర్తి పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీని దేవస్థాన చైర్మన్ జూలూరి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా గంప శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో 2024 దసర శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, పూర్వ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, శేఖర్, ప్రసాద్, ముత్యాలు, మోహన్‌బాబు, రవి, శ్రీనివాసులు, ప్రవీణ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

## పొలాల్లో పంటకోత సేకరణ

బిజినేపల్లి, సెప్టెంబర్ 12: మండలంలోని లట్టుపల్లి గ్రామంలో పొలాల్లో పంటకోతలో భాగంగా జొన్నపంట దిగుబడి తెచ్చుకునేందుకు గురువారం పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారులు, రైతుల సమక్షంలో పంటలు సేకరించారు. దీన్నిబట్టి ఎంత మోతాదులో పంటదిగుబడి వచ్చిందని నిర్ధారణ చేయవచ్చని ఏవో నీతి తెలిపారు. అదేవిధంగా లట్టుపల్లిలో ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఏవో తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని ఆగ్రో రైతు కేంద్రాల్లో 108 మెట్రిక్ టన్నుల యూరియా, ప్రైవేట్ డీలర్ల వద్ద 48 మెట్రిక్ టన్నుల యూరియా, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 95 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డుతో వచ్చి ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఫర్వీద్ అన్సారీ, ఏఈవో శారద, గోపి, రైతులు ఉన్నారు.



పంటకోత సేకరణలో అధికారులు